ప్రజాశక్తి

సోమవారం 17 జులై 2023
5
శ్రీకాకుళం

జీడి రైతుల గగ్గోలు చెవికెక్కవా?

- మద్దతు ధర ఇవ్వకుంటే ఉద్యమిస్తాం
- మంత్రి సీదిరికి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ
- పలాస నియోజవర్గంలో కొండలు మాయం
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు

మద్దతు ధర లేక జీడి రైతులు పెడుతున్న గగ్గోలు రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక మంత్రుల చెవికెక్కడం లేదా అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బస్సు యాత్రను రెండో రోజు ఆదివారం పలాసలో టిడిపి కార్యాలయం వద్ద మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జీడి పిక్కల ధర రూ.14 వేల నుంచి రూ.7 వేలకు అమాంతం పడిపోతే, స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజుకు సిగ్గుగా అనిపించడం లేదా అని అన్నారు. ముఖ్యమంత్రికి ఉత్తరం రాశానని చెప్తున్నారని, ఆ ఉత్తరానికి నేటికీ అతీగతి లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. మంత్రికి పొద్దున లేస్తే ఎవరిని తిట్టాలి, ఎక్కడ ఏ భూములు ఆక్రమించుకోవాలి, ఏ కొండలు కొల్లగొట్టాలనే ధ్యాస తప్ప రైతుల సమస్యలు పట్టవని ఆరోపించారు. మంత్రికి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అని ఎద్దేవా చేశారు. జీడి మద్దతు ధరపై రైతులు పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. జీడి మద్దతు ధరపై చంద్రబాబు నాయుడుతో మాట్లాడి ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోతే రైతులతో కలిసి పోరాడతామని హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో జీడి రైతుల సమస్యలను ఎంపీ రామ్మోహన్ నాయుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు. రాష్ట్రానికి జగన్ రూపంలో నాలుగేళ్ల కిందట దరిద్రం పట్టిందని, అది వదలాలంటే ప్రతి టిడిపి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. అవగాహన లేని వ్యక్తి జగన్ అధికారంలోకి వచ్చి వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు పట్టించారని విమర్శించారు.

కొండలు మాయం

పలాస నియోజకవర్గంలో కొండలన్నింటినీ వైసిపి నాయకులు మాయం చేస్తున్నారని, భవిష్యత్‌లో కొండలంటే ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి వస్తుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. మంత్రి అప్పలరాజు అవినీతి చక్రవర్తిగా మారారని ఆరోపించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటామన్నారు. కాలనీలో శ్మశానవాటిక ఏర్పాటుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని చెప్పారు. టిడిపి హయాంలో నిర్మించిన హుదూద్ గృహాలను నాలుగేళ్లయినా వైసిపి ప్రభుత్వం పంపిణీ చేయలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. జగనన్న ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి సెంటు స్థలం ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు.

మందసలో టిడిపి, వైసిపి నాయకుల తోపులాట

మందస మండలం నల్లబొడ్లూరులో వైసిపి నాయకులు తవ్వేసిన కొండను పరిశీలించేందుకు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, శిరీష తదితరులు వెళ్లారు. అక్కడ ఉన్న వైసిపి శ్రేణులు ఇక్కడికి ఎందుకు వచ్చారని టిడిపి నాయకులతో వాగ్వివాదానికి దిగారు. ఆక్రమంలో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు అక్కడకు చేరుకుని వారిని చెదరగొట్టడం వివాదం సద్దుమణిగింది. అనంతరం అక్కడకు వెళ్లిన టిడిపి నాయకులు కొండ మాయమైందని సెల్ఫీ దిగారు. బెండిగేటులో హుదూద్ ఇళ్ల వద్ద, అన్నా క్యాంటీన్ వద్ద సెల్ఫీ తీసుకున్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, నాయకులు రాజబాబు, ఎన్.కామేశ్వరరావు, జి.వసంతస్వామి, బద్ద నాగరాజు, రట్టి లింగరాజు, జి.వసంతస్వామి, సూరాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న గౌతు శ్యామసుందర శివాజీ


రైతు సంఘ నాయకులకు పూల బొకేలు ఇచ్చి జాతాకు స్వాగతం పలుకుతున్న మాకనపల్లి గ్రామస్తులు

జీపుజాతాకు అపూర్వ ఆదరణ

- హారతులు ఇస్తూ స్వాగతం పలుకుతున్న ప్రజలు
- జాతా సాగిన ప్రతిచోటా పెద్దసంఖ్యలో తరలివస్తున్న జీడి రైతులు
- ఆలోచింపజేస్తున్న కళాకారుల గీతాలు

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు

జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపుజాతాకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. జాతా సాగిన ప్రతిచోటా పెద్దసంఖ్యలో జీడి రైతులు, ప్రజలు తరలివస్తున్నారు. జీపుజాతాలో వచ్చిన రైతు నాయకులకు పూల బొకేలు, హారతులు ఇచ్చి తమ గ్రామాల్లోకి స్వాగతం పలుకుతున్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు జీడిరైతుల గోడును కళ్లకు కట్టేలా ఆలపించిన గీతాలు ఆకట్టుకోవడంతో పాటు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. జాతా మూడో రోజు ఆదివారం లొత్తూరు, గరుడభద్ర, కొనూలూరు, మర్రి పాడు, మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి, రంగోయి, కొండపల్లి, ఒంకులూరు, మెట్టూరు, గడూరు తదితర గ్రామాల్లో సాగింది. పలుచోట్ల నిర్వహించిన ప్రచార సభల్లో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. జీడిపప్పు ధర రోజురోజుకూ పెరుగుతుండగా, జీడిపిక్కల ధర ఎందుకు పడిపోతుందని ప్రశ్నించారు. గతంలో రూ.14 వేలుగా ఉన్న జీడిపిక్కల బస్తా ధర నేడు రూ.ఏడు వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అండతో జీడి యజమానులు రైతాంగాన్ని తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలుకుతోందని, జీడిపిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. జీడి పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, జీడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడిపంటకు మద్దతు ధర ప్రకటించే వరకు రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీన కాశీబుగ్గ సంత మైదానంలో నిర్వహించే మహా ధర్నాలో జీడి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జాతాలో కె.హేమసూదన రావు, తమ్మినాన భాస్కరరావు, కొర్నాన బాలాజీరావు, తెప్ప లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

పిఎసిఎస్ ఉద్యోగులపై ప్రభుత్వ నిర్బంధం

'చలో విజయవాడ'కు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 17న వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాల ఉద్యోగుల చలో విజయవాడ పిలుపు నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేపట్టారు. పిఎసిఎస్ ఉద్యోగుల యూనియన్ నాయకులు, ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు. చలో విజయవాడలో పాల్గొంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశముందని నోటీసుల్లో పేర్కొన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు లోలుగు మోహనరావును హిరమండలంలోని తన నివాసంలో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కవిటి పిఎసిఎస్ సిఇఒ వి.జానకిరామయ్యను అరెస్టు కవిటి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికొందరిని గృహ నిర్బంధం చేశారు. అక్రమ అరెస్టు, గృహ నిర్బంధాలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.


కవిటి పోలీస్‌స్టేషన్‌లో జానకిరామయ్య

ఉద్యోగ సంఘాలపై కేంద్రం కక్ష

- ఎన్‌ఎఫ్‌పిఇ, ఎఐపిఇయు గుర్తింపును పునరుద్ధరించాలి
- ఎఐపిఇయు, పిఎంజి మహాసభల్లో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్-సి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇ.శంకరనాయుడు, బి.శ్రీధర్‌బాబు విమర్శించారు. అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం, పోస్టుమెన్, ఎంటిఎస్, జిడిల అనుబంధ సంఘం 11వ ద్వైవార్షిక జిల్లా మహాసభలు నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా సంఘ పతాకాన్ని అధ్యక్షులు శంకరనాయుడు ఆవిష్కరించారు. అనంతరం బాపూజీ కళామందిర్ నుంచి పాలకొండ రోడ్డు మీదుగా కృష్ణాపార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన మహాసభలో వారు మాట్లాడుతూ కక్షపూరిత ధోరణితోనే కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, అఖిల భారత పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్-సి సంఘాల గుర్తింపును రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన గుర్తింపును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు రద్దు తర్వాత తపాలా శాఖలో జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. పోస్టల్ శాఖను సంక్షోభంలోకి నెట్టేందుకు జరుగుతున్న కుట్రలను భగ్నం చేసేందుకు, ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పోరాడే సత్తా ఉన్న సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సభ్యులకు పిలుపునిచ్చారు. జిడిఎస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిడిఎస్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోస్ట్‌మెన్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామానందం మాట్లాడుతూ పోస్ట్‌మెన్లకు బలవంతపు లక్ష్యాలను నిర్దేశించడం, సొంత మొబైల్ ఫోన్లలో డెలివరీ డేటా అప్‌లోడ్ చేయాలని వేధించడం ఆపాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిఐటియు సీనియర్ నాయకులు వి.జి.కె మూర్తి హాజరయ్యారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాల ఎన్నిక

అనంతరం సంఘాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్-సి సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా యు.వి రమణ, కె.గణపతి, పోస్టుమెన్, ఎంటిఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు, ఎల్.బాబూరావు, జిడిఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.ఎస్.ఆర్ మూర్తినాయుడు, ఎన్.నందికేశ్వరరావు ఎన్నికయ్యారు. వారితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మహాసభలో మాట్లాడుతున్న శంకరనాయుడు



ట్రోఫీని అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మేధస్సును పెంచే క్రీడ చెస్

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మేధస్సును పెంచే క్రీడ చెస్ అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో ఎపి చెస్ అసోసియేషన్ ఓపెన్ టోర్నమెంట్ (జననాయక్ చౌదరి సత్యనారాయణ ట్రోఫీ) ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదరంగం నేర్చుకుంటే వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినట్లు అవుతుందన్నారు. జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తే తప్పక సహకరిస్తామన్నారు. నిర్వాహకులు చెస్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం, కార్తికేయ స్పోర్ట్స్ ట్రస్టు, చౌదరి సత్యనారాయణ ట్రస్టును అభినందించారు. టోర్నమెంట్‌లో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ ప్రథమ స్థానం సాధించగా, అనకాపల్లి జిల్లాకు చెందిన సాకేత్ ద్వితీయ స్థానం, విశాఖపట్నం జిల్లాకు చెందిన రిత్విక్, వరహాలు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. జిల్లాకు చెందిన కుప్పిలి సాయి వెంకట్ ఐదో స్థానంలో నిలిచాడు. వీరితోపాటు 20 మంది క్రీడాకారులకు రూ.52 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు మెమోంటోలు అందజేశారు. అనంతరం విజేతలకు కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణితో కలిసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చెస్ స్టేట్ సెక్రటరీ సనపల భీమారావు, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె.వేణుగోపాల్, బగాది కిషోర్, చౌదరి సతీష్, మురళి, కామేశ్వరి, జ్యోతి తేజ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-భువనేశ్వర్ మధ్య వందేభారత్

రైల్వే మంత్రికి ఎంపీ రామ్మోహన్ నాయుడు లేఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



విశాఖపట్నం నుంచి ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు ప్రతిష్టాత్మక సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈమేరకు ఆదివారం ఆయనకు లేఖ శారు. భౌగోళికం, సంస్కృతి, సంప్రదాయాల పరంగా ఈ రెండు ప్రాంతాల మధ్య సంబంధ బాంధవ్యాలు ఉన్నాయని గుర్తుచేశారు. విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య విద్య, వైద్యం, వాణిజ్యం, ఇతర కారణాలతో రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వందేభారత్ రైలును ఈ ప్రాంతానికి కేటాయించాలని కోరారు. ఆ రైలుకు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని పేర్కొన్నారు. ఈ రైలు నడపడం వల్ల శ్రీకాకుళం జిల్లాలోని చారిత్రిక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల సందర్శనకు వచ్చే యాత్రికులు ఒడిశాలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించగలరని తెలిపారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

శ్రీకాకుళం లీగల్ : కృష్ణా జిల్లా అవనిగడ్డ బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది జి.శ్రీనివాసరావుపై మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు అలాగే ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే న్యాయవాదులు రక్షణ చట్టం చేయాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పోలీసుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్ సిబ్బంది పిల్లల విజయం వెనుక వారి తల్లిదండ్రులు కష్టం ఉంటుందని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. పోలీసు సిబ్బంది పిల్లలు మంచి ర్యాంకులు సాధించినప్పుడే తల్లిదండ్రులకు గౌరవం లభిస్తుందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 'మన ఆణిముత్యాలు-2023' పేరుతో పదో తరగతిలో 550 పైబడి, ఇంటర్మీడియట్ 950 పైబడి మార్కులు, నీట్, జెఇఇ అడ్వాన్స్, బిట్స్, ఎంసెట్ తదితర విభాగాల్లో మంచి మార్కులతో ఉత్తమ ర్యాంకులు సాధించిన పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. 2022-23 సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 19 మందికి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 12 మందికి, ఎంట్రన్స్ సెట్స్‌లో ఎనిమిది మంది విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు ప్రతిభా పురస్కారాలు అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో అనేక సవాళ్లు, ఒత్తిళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ కుటుంబ కోసం సమయం కేటాయించి పిల్లల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో పోలీస్ సిబ్బంది కృషి గర్వించదగ్గ విషయమన్నారు. వచ్చిన మార్కులు, ర్యాంకులతో సంతృప్తి చెందక భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానంలో ప్రతిఒక్కరూ ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలో ఎటువంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని కష్టపడి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు వై.శృతి, ఎస్.బాలరాజు, పోలీస్ సంఘం కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, కె.అప్పన్న, జగదాంబ, పోలీసుల కుటుంబసభ్యులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎస్‌పి రాధిక తదితరులు

పంట కాలువల పనులు వేగవంతం

- బకాయిల చెల్లింపులు వేగవంతం
- పని దినాల ఆధారంగా వేజ్ కాంపొనెంట్
- డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్





వర్షాలు కురిసే లోపు పంట కాలువల అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు తెలిపారు. పంట కాలువల పనులతో శివారు భూములకు సాగునీటి సమస్య కొంతమేరకు పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూలి బకాయిల చెల్లింపులకు వీలుగా త్వరితగతిన బిల్లులు అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. వేజ్ కాంపొనెంట్ పెంచుకునేందుకు పని దినాలు పెరగాల్సి ఉందన్నారు. వర్షాలు ఆలస్యం కావడం వల్ల పని దినాలు పెంచుకునేందుకు వీలుందన్నారు. పలు అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

జిల్లాలో ఉపాధి హామీ పనుల లక్ష్యాలను ఎంతమేరకు పూర్తి చేయగలిగారు?

జిల్లాలో 6.50 లక్షల మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. వారందరికీ పని కల్పించాలన్నదే లక్ష్యం. కూలీలు రోజుకు సరాసరి రూ.272 గరిష్ట కూలి పొందేందుకు అవకాశం కల్పించాం. కొన్ని ప్రాంతాల్లో ఆ మొత్తం తక్కువగా పొందుతున్నారు. పనులు చేసుకునే అవకాశమున్నా శ్రద్ధ చూపకపోవడమే ఇందుకు కారణం. ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యం కావడం వల్ల పనులు చేసుకునేందుకు వీలు కలిగింది. అందువల్ల ఈ సమయంలో రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు పంట కాలువల అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

కూలీలకు సురక్ష బీమా యోజన వర్తింపజేస్తున్నారా?

జిల్లాలోని 6.50 లక్షల మంది కూలీల్లో 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకానికి అర్హులు. వారు తమ కూలి డబ్బుల నుంచి ఏడాదికి రూ.20 ప్రీమియంగా చెల్లిస్తే చాలు వారికి బీమా వర్తిస్తుంది. ఈ బీమా ప్రీమియం చెల్లించిన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ రూ.రెండు లక్షలు పరిహారం అందించడం జరుగుతుంది. ప్రమాదం పాక్షికంగా సంభవించినా, అంగవైకల్యానికి గురైనా రూ.లక్ష పరిహారంగా బీమా సంస్థ చెల్లిస్తుంది. గ్రామస్థాయిలో వెలుగు ఫెసిలిటేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఈ పథకంలో కూలీలను భాగస్వాములను చేస్తున్నారు. గతేడాది సుమారు మూడు లక్షల మందికి బీమా సౌకర్యం కల్పించాం. ఈ ఏడాది శతశాతం కూలీలను ఈ పథకంలో చేరే విధంగా సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించాం.

ఉపాధి పనుల్లో మెటీరియల్ కాంపొనెంట్ ఈ ఏడాది ఎంత లక్ష్యంగా నిర్ణయించారు?

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు నిర్మిస్తోంది. రైతుల అవసరాలకు అనుగుణంగా రైతుభరోసా కేంద్రాలను మంజూరు చేసింది. మొదటి విడతలో జిల్లావ్యాప్తంగా 834 రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలను సమకూర్చడానికి రూ.183.25 కోట్లు ఖర్చు చేయడమైంది. రెండో విడతలో మరికొన్ని భవన నిర్మాణాలు చేపట్టడమైంది. బల్క్ కూలింగ్ కేంద్రాలతో పాటు గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది. కొన్నిచోట్ల స్థల సమస్య, ఇతర కారణాల వల్ల మంజూరు చేసేందుకు వీలు కాలేదు. మంజూరైన వాటిలో శతశాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేజ్ కాంపొనెంట్ పెంచుకోవడం వల్ల మెటీరియల్ కాంపొనెంట్ పెరుగుతుంది.

అమృత్ సరోవర్ పనులు ఎలా సాగుతున్నాయి?

జిల్లాలో అమృత్ సరోవర్ కింద 80 చెరువులను సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ప్రతి నియోజకవర్గంలోని అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు మంజూరు చేయడమైంది. వీటిలో 32 చెరువుల్లో పనులు పూర్తి చేయడమైంది. 10 శాతం నిధులు మెటీరియల్ కాంపొనెంట్‌కు ఖర్చు చేసుకోవచ్చు. గట్టుపై అందమైన మొక్కలు పెంచడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ పథకం దోహదపడుతోంది. ఈ ఏడాది కొత్తగా మరికొన్ని చెరువులకు ప్రతిపాదనలు పంపించడమైంది. అవి మంజూరు కావాల్సి ఉంది.

జిల్లాలో ఎంతమేర కూలి బకాయిలు చెల్లించాల్సి ఉంది? చెల్లింపునకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లాలో ఉపాధి హామీ కూలీలందరికీ సకాలంలో కూలి చెల్లింపులు చేస్తున్నాం. నేరుగా వారి ఖాతాలకు నిధులు జమ అవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో రూ.76 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వాటికి సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఆలస్యం లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఏ పనికైనా బిల్లులు సకాలంలో పంపిస్తే, సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయి. బకాయిల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.


పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న లక్ష్మీభార్గవి

ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలి

కార్యకర్తలకు అచ్చెన్న పిలుపు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కార్యకర్తలు, నాయకులు ఇప్పటినుంచే ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో అచ్చెన్న ఉన్నారన్న విషయం తెలుసుకుని నాయకులు, కార్యకర్తలు ఆదివారం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండలం నర్సాపురం, ఎం.నర్సాపురం, ఝంకుహనుమంతుపురం, కోటపాడు, బృందావనం, సంతబొమ్మాళి, అంట్లవరం, ఆకాశలక్కవరం, పాలతలగాం, టెక్కలి, లింగాలవలస, సౌడాం, రేగులపాడు, కిష్టుపురం, పట్టుపురం, కురుడు, ఎరకయ్యపేట, రామేశ్వరం గ్రామాలకు చెందిన నాయకుల, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే నందిగాం మండలం భోరుభద్రకు చెందిన దడియాల హేమచలం, దడియాల నవీన్ తదితర నాయకులు అచ్చెన్న సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజర్ కార్యదర్శి కోట సంతోష్ కుమార్, విశాఖపట్నం నార్త్‌జోన్‌కు చెందిన మహిళా నేత దువ్వాడ లక్ష్మీభార్గవి, నందిగాం టిడిపి మండల అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'అన్న క్యాంటీన్'కు వితరణ

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం ఆవరణలో పేదల కోసం ఏర్పటు చేసిన అన్న క్యాంటీన్‌కు పాలతలగాంకు చెందిన బడే అరుణ తన తండ్రి విశ్రాంతి ఉపాధ్యాయుడు సనపల మల్లేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఆదివారం రూ. 5 వేలును వితరణగా అచ్చెన్నాయుడుకు అందజేశారు.

అరసవల్లిలో మాస శివరాత్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, నగేష్ శర్మల ఆధ్వర్యాన ఆదివారం మాస శివరాత్రి వేడుకలను ఆలయ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రూ.5.03 లక్షల ఆదాయం

ఆషాడ మాసం ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ కొంతమేరకు తగ్గడంతో ఆదాయం సాధారణస్థితిలో సమకూరింది. టిక్కెట్ల రూపంలో రూ.2,05,800, విరాళాల రూపంలో రూ.87,472లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,09,900 ఆదాయం సమకూరిందని తెలిపారు.

భూ కబ్జాలకు కేరాఫ్ పలాస

ఎర్రకాలువ భూముల కబ్జా

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో పలాస ఒకటి. ఈ నేపథ్యంలో పలాస భూ కబ్జాలకు కేరాఫ్‌గా మారింది. పలాస-కాశీబుగ్గ జంట పట్టణంలో భూములు కొనుగోలు చేయాలంటే కొనుగోలుదారులు సందిగ్ధంలో పడుతున్నారు. ప్రస్తుత నాయకులు ఖాళీ స్థలమా? ప్రభుత్వ స్థలమా? గెడ్డ ఫారం పోగా వారికి అవసరం లేదు. ఖాళీ భూములు కనిపిస్తేచాలు ఆక్రమణకు పాల్పడుతున్నారు. అటువంటి ఘటనే పలాసలో సుమారు 25 మంది కొనుగోలు చేసిన భూములపై ఆక్రమణదారుడు కన్ను పడింది. అంతే రాత్రికి రాత్రే పునాదుల సైతం పెకలించి చదును చేయడంతో ఒక్కసారిగా పట్టణం ఉలిక్కిపడింది.

పలాస సాయిబ్ కాలనీ సమీపంలో పురుషోత్తపురం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 35, 43, 44, 45, 46లో ఉన్న నెమలికొండ నుంచి పురుషోత్తపురం ఎర్రచెరువు వరకూ ఉన్న కొండకాలువ (ఎర్రకాలువ) భూముల వివాదం రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటికే చెరువు వరకూ ఉన్న 6.50 ఎకరాల భూమిని స్థానిక రాజకీయ నాయకులు పక్కా రిజిస్ట్రేషన్లతో అమ్ముకున్నట్లు ప్రచారంలో ఉంది. తాజాగా ఆ ప్రాంతంలో ఉన్న భూములతో పాటు జిరాయితీ భూములనూ మరికొంత మంది ప్రజాప్రతినిధులు పునాదులను పెలికించి


స్థలాన్ని చదును చేసిన ఆక్రమణదారులు

ఆక్రమించుకోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. వీరి ఆక్రమణల వ్యవహారం ఏ విధంగా ఉన్నా ఎర్రకాలువ భూములు పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో శాంతిభద్రతల సమస్యలుగా మారుతున్నాయి. రెండు రోజుల క్రితం ఉపాధ్యాయులు, మిలట్రీ ఉద్యోగులు, పోలీసులకు చెందిన జిరాయితీ స్థలాలను ఓ నాయకులు తమ భూములంటూ ఎక్స్‌వేటర్లో చదును చేయడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ భూముల్లో సర్వే నంబరు 35లో పురుషోత్తపురానికి చెందిన అమ్మాజమ్మకు 80 సెంట్లు స్థలాన్ని అధికారులు 20 ఏళ్ల క్రితం అప్పగించారు. అంతే తప్ప కాలువ సర్వే నంబరులో అదనంగా ఒక్క పట్టా కూడా మంజూరు చేయలేదు. కానీ, కొండ నుంచి చెరువు వరకూ ఉన్న కిలోమీటరు పొడవు, వంద అడుగుల వెడలు ఉన్న కాలువ మాత్రం ప్రస్తుతం కనుమరుగయిపోయింది. మీరంటే మీరమ్ముకున్నారంటూ వైసిపి, టిడిపి నాయకులు వాదనలు వినిస్తున్నారు. కానీ, ఒక్క ఆక్రమణను ఎవరూ తొలగించలేకపోయారు. రెండేళ్ల క్రితం టెక్కలి ఆర్‌డిఒ ఈ ప్రాంతాన్ని సందర్శించి కాలువ భూముల ఆ క్రమణలపై కొరడా ఝులిపించి ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారందరికీ నోటీసులు ఇమ్మని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. తరువాత పలాస సబ్ డివిజన్ ఏర్పడడంతో ఆ ప్రయత్నం ఆదిలోనే ఆగిపోయింది. దీంతో పాటుగా మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మున్సిపల్ కార్యాలయంలో జెసి ఎం.నవీన్ ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ దర్బారులో ఆక్రమణలపైనే ఫిర్యాదులు స్వీకరించారు. తమ పార్టీకి చెందిన వారెవ్వరూ ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఆక్రమణలు తొలగించి తమపై వస్తున్న ఆరోపణలకు పులిస్టాఫ్ పెడతామని పత్రికాముఖంగా ప్రకటించారు. ఇదిలా ఉండగా దర్బారు తరువాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. వైసిపి నాయకులకు క్లీన్ చిట్ ఇవ్వడంతో వారు మరింత ఆక్రమణలకు పాల్పడుతుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా కొండ చెరువుకు వెళ్లే మార్గం మధ్యలో ఉన్న సుమారు 60 సెంట్లు భూమిని తమకు పట్టాలు ఉన్నాయని, తమకు చెందిన స్థలాలని ఆ ప్రాంతంలో పునాదులు వేసిన వాటినీ చదును చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కొండ కాలువ భూమితో పాటు జిరాయితీ స్థలాలనూ ఇదే అదనుగా చదచేయడంతో కొనుగోలుదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహాశీల్దార్ ఎల్.మధుసూదనరావును వివరణ కోరగా... కొనుగోలుదారుల భూములను ప్రయివేట్ వ్యక్తులు చదును చేసినట్లు మా దృష్టికి రాలేదని చెప్పారు. ప్రభుత్వ భూమి అయితే నోటీసు అందజేస్తామని అన్నారు.


మాట్లాడుతున్న చింతాడ రవి

వ్యవస్థలపై పవన్‌కు అవగాహన లేదు

ఆమదాలవలస : వ్యవస్థలపై అవగాహన లేని వ్యక్తి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వ్యక్తి నాయకునిగా ఎదగాలంటే పరిపాలన వ్యవస్థలాన్నింటిపై అవగాహన ఉండాలన్నారు. వాలంటీర్లు నాలుగేళ్లుగా ప్రజలకు అనేక సేవలు అందించా రని అన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో పవన్ కళ్యాణ్ హైదరాబాదులో విలాసాలు అనుభవిస్తూ కాలం గడిపారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి వివరాలు సచివా లయంలో కేంద్రీకృతమై ఉంటాయని అన్నారు. అటువంటి వివరాలను వాలంటీర్ల ద్వారా చేరవేయాల్సిన అ వసరం ఏ ముందో పవన్ తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఈశ్వరరావు, భాస్కరరావు, దుర్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధి, భూమి, సామాజిక సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కె.ఎల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడులో మండల అధ్యఓఉలు డి.భాస్కరరావు అధ్యక్షతన మండల వ్యవసాయ కార్మిక సంఘం ఏడో మహాసభను ఆదివారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1934లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు శాఖలుగా విస్తరించి దేశంలో కోటికి పైగా సభ్యత్వం కలిగిన అతిపెద్ద సంఘంగా ఎదిగిందన్నారు. వ్యవసాయ కార్మికులకు చేతినిండా పని కల్పించి పనికి తగ్గ కూలి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు మౌలిక సమస్యలైన అందరికీ ఉపాధి, ఇళ్లు, సాగు భూమి, సమానత్వం, ఆహార భద్రత, విద్య, వైద్యం లాంటి


జెండాను ఎగురవేస్తున్న ప్రసాద్

సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్హులైన పేదలందరికీ మూడు ఎకరాలు భూమి పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సమ్మర్ధవంతంగా అమలు చేసి ప్రతి జాబ్ కార్డు దారునికీ 200 రోజులు పనులు కల్పించాలన్నారు. అనంతరం సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా బి.హేమంత్, భాణుమ్మ, సహాయ కార్యదర్శులుగా కె.దాలయ్య, పి.రామారావు, ఉపాధ్యక్షులు కె.సరోజనమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి డి.భాస్కరరావు, నెయ్యిల మోహనరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని లచ్చయ్యపేట కూడలి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డాడు. లచ్చయ్యపేటకు చెందిన సీర సన్యాసి (62), అల్లుడు కొంచాడ రమేష్‌లు గ్రామానికి సమీపంలో ఉన్న ఇటుకలు తయారు కంపెనీలో రోజు కూలీగా పనిచేస్తున్నారు. ఉదయం పనికి వెళ్లి మధ్యాహ్నం భోజనం కోసం సైకిల్‌పై ఇంటికి వస్తున్నారు. పాలకొండ నుంచి వస్తున్న మ్యాక్సీ క్యాబ్ సైకిల్‌ను బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సన్యాసి అక్కడికక్కడే మృత్యువాత పడగా, రమేష్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే 108లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లచ్చుమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లలు మృతదేహంపై పడి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

శివసాగర్ బీచ్‌లో యువకుడు గల్లంతు


నవీన్ (ఫైల్)

వజ్రపుకొత్తూరు : మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం యువకుడు గల్లంతవడంతో విషాదం నెలకొంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పద్మనాభపురానికి చెందిన కొండె నవీన్ తన స్నేహితులతో కలిసి శివసాగర్ బీచ్‌కు విహారయాత్రకు వచ్చారు. స్నేహితులు అందరూ కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానానికి దిగారు. స్నేహితులు అందరూ ఒడ్డుకి చేరుకున్నా నవీన్ కనిపించకపోవడంతో వారు బోరుమన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందు తున్న శివసాగర్ తీరంలో రక్షణ చర్యలు చేపట్టకపో వడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతు న్నారు. గల్లంతైన యువకుడు డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో పోటీ పరీక్షలకు చదువుతున్నాడు. ఇంతలోనే ఇలా జరగడం తోటి స్నేహితులు జీర్ణించుకోలేకపోతు న్నారు. ఒక్కగానొక్క కుమారుడు విహారయాత్రకు వచ్చి గల్లంతు కావడంతో తల్లిదండ్రులు నాగరాజు, చామంతి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


బోల్తా పడిన వాహనం

'ఫిష్ ఆంధ్ర' వాహనం బోల్తా

టెక్కలి రూరల్ : మండలంలో టెక్కలి-పాతనౌపడ రోడ్డు చిన్న నారాయణపురం వద్ద మొబైల్ వాహనం ఆదివారం బోల్తా పడింది. సంతబొమ్మాళి మండలం గద్దలపాడుకు చెందిన వ్యక్తి భావనపాడు నుంచి చేపలను లోడ్ చేసి తీసుకెళ్తుండగా గేదెను తప్పించబోయి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం వాహనాన్ని స్థానికులు, అటుగా వచ్చిన ప్రయాణికులు లేపడంతో టెక్కలి వైపు వెళ్లిపోయారు.

నత్తనడకన అర్బన్ హెల్త్ సెంటర్


నత్తనడకన సాగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో బెల్లుపడ వద్ద 2021 జూలై 9న అప్పటి ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లు పూర్తయినా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు నత్తడకన సాగుతున్నాయి. రెండేళ్లుగా నిర్మాణ పనులు జరుగుతూ త్వరలో పూర్తి

నిర్మాణ సమయంలోనే పగుళ్లు

చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో నూతన భవన నిర్మాణంలో అప్పుడే పగుళ్లు రావడంతో నిర్మాణ పనులు ఎంత నాణ్యతగా జరిగింది అన్నది స్పష్టం చేస్తున్నాయి. రూ.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టారు. ఇంజినీర్ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వల్లే నూతన భవనంలో పగుళ్లు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాక్షాత్తు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు కావడంతో చర్చనీయాంశమైంది. అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకొని భవన నిర్మాణంలో లోపాలను సరిచేసి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

డమ్మీ ఆపరేటర్లతో సరుకుల పంపిణీ


బియ్యం వాహనం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఎండియు ఆపరేటర్ నక్క మౌళి డుమ్మా కొడుతూ డమ్మీ వారితో రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని ప్రజలు ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేయడానికి ఎండియు వాహనాలు ఏర్పాటు చేసింది. ఈ వాహనాలకు ఎండియు ఆపరేషన్ నియమించింది. ఇంటింటికీ వెళ్లి సరుకులను పంపిణీ చేయాలి. నక్క మౌళి అనే ఎండియు ఆపరేటర్‌కు మూలపేట డిపో పరిధిలో 703 కార్డులకు గాను, 590 కార్డులకు సంబంధిత ఆపరేటర్ పంపిణీ చేశారు. మిగతా 44

నిలదీసిన సూరాడవానిపేటవాసులు

కారులు పార్టుబులిటీలో తీసుకొచ్చారు. కె.లింగూడు డిపో పరిధిలో 591 కార్డులకు గాను 451 కార్డులకు బియ్యం పంపిణీ చేశారు. మిగతా 77 కార్డులు పార్టుబులిటీలో తీసుకున్నారు. పాతమేఘవరం డిపో పరిధిలో 392 కార్డులకు 66 మందికే పంపిణీ చేశారు. మిగతావి పార్టుబులిటీలోకి తీసుకున్నారు.

సంబంధిత ఆపరేటర్ ప్రతినెలా డిపో పరిధిలో 25 నుంచి 50 కార్డులకు బియ్యం పంపిణీ చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం చివరి రోజు కావున ఈ నెల రేషన్ కూడా అందదని తెలుసుకొని లబ్ధిదారులు సంబంధిత ఆపరేటర్‌కు ఫోన్ చేశారు. ఆపరేటర్ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మధ్యాహ్నం 2 గంటలకు నాలుగురు డమ్మీ ఎండిఎం ఆపరేటర్లు బండి పట్టుకొని సూరాడవానిపేట వచ్చారు. వచ్చీరాగానే సంబంధిత ఆపరేటర్ నక్క మౌళి ఎక్కడ ఉన్నాడు... మీరు ఎందుకు వచ్చారని నిలదీస్తూ... నిదాలు చేశారు. స్థానిక నాయకులు వచ్చి గ్రామస్తులకు నచ్చ చెప్పినా లబ్ధిదారులు తగ్గలేదు. ప్రతినెలా 25 నుంచి 30 మంది మిగిలిపోతే తరువాత ఇస్తానని చెప్పి ఇవ్వకుండా డమ్మీ ఎండిఎంలను పంపిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ డిటి రాముకి వివరణ కోరగా, సంబంధిత ఆపరేటర్‌కు ఎన్ని సార్లు చెప్పినా తీరు మారడం లేదని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టిడిపిలోకి పలువురు చేరిక

ప్రజాశక్తి- కొత్తూరు

టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృసి చేయాలని టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు స్థానిక టిడిపి నాయకులు ఎద్దు దాసునాయుడు ఆధ్వర్యాన ఎంజిఆర్ సమక్షంలో మండలంలోని పలువురు ఆదివారం టిడిపిలోకి చేశారు. ఈ సందర్భంగా ఎంజిఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి రోజురోజుకూ బలపడుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేయడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో అరుబోలు దశరథ, బిల్లింగి భాస్కరరావు, పిండి వెంకటరామారావు, వాలిపల్లి వెంకటరావు, దూబ చిన్నారావు, యర్లంకి తిరుపతిరావు, పోతల రమణ, కోల దుర్గారావు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోవిందరావు

రమేష్‌బాబుకు పరామర్శ

మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావు చిన్న కుమారుడు రమేష్‌బాబును పరామర్శించారు. రమేష్‌బాబు ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంజిఆర్ మాతలలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శిం చారు. ఈయన వెంట మాతల సర్పంచ్ కలమట సుప్రియ, ఎద్దు దాసునాయుడు, అరుబోలు దశరథ, కొవిలాపు కృష్ణమాచార్య, బిల్లింగి భాస్కరరావు, పిండి వెంకట రామారావు, కోడూరు రామారావు, వాలిపిల్లి వెంకటరావు, దూబ చిన్నారావు ఉన్నారు.

జగన్నాథసాగరంలో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న జగన్నాథ సాగరంలోని ఆక్రమణలు తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయకట్టు రైతులు కోరారు. స్థానిక ప్రగతి భవనంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జగన్నాథ సాగరంలో కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను ఆక్రమించారని అన్నారు. ఈ విషయంపై గత టిడిపి ప్రభుత్వంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. మీ హయాంలోనైనా శాశ్వత పరిస్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 20 ఎకరాలు ఆక్రమించుకున్నా ఎవరూ



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పట్టించుకోవడం లేదని వాపోయారు. సాగు, తాగునీటికి ఉపయోగపడే జగగన్నాథ సాగరంలో ఆక్రమణలు తొలగించకుంటే ఆందోళన చేపడతామనిహెచ్చరించారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, పి.హరి, ఎస్.రవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డి.భవాని, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, సవర సోమేశ్వరరావు, రైతులు నాగరాజు పండా, వాసు, గిరి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


రమేష్ పట్నాయక్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న అరసడ రమేష్ పట్నాయక్ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులుగా ఆదివారం ఎంపికయ్యారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

వంతెన నిర్మాణ పనులు వేగవంతం

ఇచ్ఛాపురం : బాహుదా వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారవు రోడ్లు, భవన నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. కూలిన బాహుదా వంతెన వద్ద నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంతెన కూలిపోవడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈయన వెంట వైసిపి నాయకులు పిలక సంతోష్, పి.కోటేశ్వరరావు, బి.జగన్ ఉన్నారు.


రాధమ్మను పరామర్శిస్తున్న శ్రీకాంత్

శ్రీకాంత్ పరామర్శ

మెళియాపుట్టి : మండలంలో పలువురిని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆదివారం పరామర్శించారు. ఆంపురంలోని రంకిడి దుర్గయ్య ఇటీవల మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించారు. రింపిపోలమ్మ ఇటీవల అనారోగ్యం గురికావడంతో ఆమెను పరామర్శించి ఓదార్చారు. పెంగువాడకు చెందిన గొందర గణపతి, గొందర బలరాంలను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆంపురం గ్రామస్తులు ఘన స్వాగతం పలికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు గణేష్ ప్రధాన్, జనపరెడ్డి కన్నబాబు, పెద్దింటి చందరరావు, సిద్దిపాలెం గౌరీస్, సంపతరావు సాయి, బోసి రామారావు, వెంకటరావు, వాబ జగన్ పాల్గొన్నారు.

అక్షయపాత్ర వంటశాలకు ఐఎస్ఒ గుర్తింపు


ఐఎస్ఒ ధ్రువీకరణను పొందుతున్న సంస్థ ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద ఉన్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత వంటశాలకు ఐఎస్ఒ గుర్తింపు ఆదివాం దక్కింది. ఈ వంటశాల నుంచి జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకాన్ని శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస మండలాల్లోని 309 పాఠశాలలకు ఈ వంటశాల నుంచి సరఫరా చేస్తున్నామని అన్నారు. సురక్షితంగా, పరిశు భ్రంగా ఉండేలా వంటశాలను నిర్వహిస్తున్నందుకు ధ్రువీకరణ మూల్యాంకన ప్రక్రియ చేపట్టి నాణ్యత నిర్వహణ వ్యవస్థ అభివృద్ధి, నిర్వహణ వ్యవస్థ డాక్యుమెంటేషన్ సమీక్ష, ఆడిట్, ప్రాథమిక అంచనాలు పరిశీలించినపై ఈ గుర్తింపు ప్రకటించారని అక్షయపాత్ర ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ పి.వెంకటరాజు తెలిపారు.

ప్రజా పోరాటాలు కొనసాగిస్తాం


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

టెక్కలి : ప్రజా చైతన్యం కోసం ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ తెలిపారు. స్థానిక బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ప్రజా నాట్యమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రజా చైతన్యం కోసం గజ్జె కట్టి నాట్యమండలి అనేక ప్రదర్శనలు చేశామని అన్నారు. మరలా ఇప్పుడు ఆ విధానాన్ని కొనసాగి స్తామని అన్నారు. మెళియాపుట్టి ఎంఇఒ-2 మల్లారెడ్డి పద్మనాభరావు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం ఆలోచన సరళి ఆధారంగా చేసుకొని పాటకు ప్రాణం పోసిన ప్రజా నాట్య మండలి పునర్వ్యవస్థీకరణ హర్షించదగ్గ విషయమ న్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, శంకరరావు, వాసుదేవ రావు, శ్రీనివాసరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పూజారిపేటలోని ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో డాక్టర్ గొలివి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 70 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ గొలివి మోహనరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏడాదిలో రెండుసార్లు తమ రక్తాన్ని బ్లడ్ బ్యాంకులకు దానం చేస్తే ఎంతోమంది క్షతగాత్రులకు ఆపదలో ఉన్న రోగులకు ఉపయోగపడుతుందని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం వంతులుగా ఉంటారన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయడంలో అపోహలు విడనాడాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంస్రాత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీడియాట్రిక్స్ వైద్యులు కూర్మాన వినోద్‌కుమార్, పి.తాతయ్యలు, చాపర సుధాకర్, సీపాన హేమమోహన్, కృత్విక్ ఫౌండేషన్ చైర్మెన్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) బగాది వెంకట్, వాయుపుత్ర జిమ్ కోచ్ శ్రీనివాసరావు, బాగాది నేతాజీ, వి.లక్ష్మణరావు, హరీష్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

పలువురికి ఆర్థికసాయం


కొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కొత్తూరు : మండలంలోని పొన్నుటూరుకు చెందిన బుద్దల నరేష్ పొట్టకూటి కోసం హైదరాబాద్ వలస వెళ్లాడు. భవన కార్మికునిగా పనిచేస్తూ.. రెండో అంతస్తు నుంచి కిందకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ కోసం భగవ్ ట్రస్టు సభ్యులు యూసఫ్‌గూడ వెళ్లి నరేష్ భార్యకు రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే పాతపట్నం మండలం తిడ్డిమికి చెందిన ఉసిరికాయల చిన్నారావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు జయవర్ధన్ బ్రెయిన్ సమస్య రావడంతో కంటి చూపు పోకుండా ఉండాలంటే ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్ కోసం వారికీ రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గేదెల రామరాజు, సవిరిగాన సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని కేదారిపురానికి చెందిన అనాపాన శ్యామలకు మెరుగైన వైద్యం కోసం గల్ఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆర్థికసాయం అందించారు. అనపాన చంద్రయ్య భార్య శ్యామల రొమ్ము కేన్సర్‌తో బాధపడుతూ శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్యం కోసం కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ రూ.23 వేలు, గ్రామస్తులు రూ.25 వేలు ఆదివారం అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు


అభినందిస్తున్న విలేకరులు

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆదివారం ఐపిఎం న్యూస్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షులు ఐపిఎం న్యూస్ టెంకల రాజేష్, కార్యదర్శిగా ధర్మవరపు సాయి, గౌరవ సలహాదారుగా కోట రామారావు, వైస్ ప్రెసిడెంట్‌గా దూపాన రాజేష్, (స్టూడియో ఎన్), ట్రెజరర్‌గా కొంచాడ జీవన్ (ఎ1 టివి)లను ఎన్నుకున్నారు. గిలాయి శంకర్, ఉప్పాడ మోహన్, గుడియ గణేష్, అంబటి కాళీ, తడక సురేష్, సునీల్, హరి పాల్గొన్నారు. అనంతరం రాజేష్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా జిల్లా నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉంటుందని అన్ని నేత్ర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. రోగులకు ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ పుస్తకం తీసుకుని రావాలన్నారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

మెళియాపుట్టి : ఈ నెల 17న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ పి.చంద్రకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొవాలన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

'సొండి'ల సంక్షేమ సంఘం ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : ఒబిసి సాధనే లక్ష్యంగా పోరాడుతున్న సొండి రాష్ట్ర సంఘాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా జిల్లాలో సిక్కోలు సొండి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని శ్రీనివాస మెడికల్ సెంటర్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా డాక్టర్ సేనాపతి శేషగిరిబాబు, ప్రధాన కార్యదర్శి రత్నాల జగన్మోహనరావు, గౌరవ అధ్యక్షులు రత్నాల వరప్రసాద్‌లను ఎన్నుకున్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గిరిజ

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపేట వేస్తున్నామని సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడ భద్ర పంచాయతీ పరిధిలో ఉన్న హరిజనపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన సిసి రోడ్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో పంచాయతీ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. రోడ్డు నిర్మాణం, పవర్ బోర్లు ఏర్పాటు, నిత్యం పారిశుధ్య పనులు, వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం.పార్వతి, ఆర్.భాస్కరరావు, ఎస్.జగ్గారావు, ఎం.చంద్రభూషణ్, ఎం.మల్లేసు, ఎం.కూర్మారావు, ఎస్.తారక్, జి.ధర్మారావు, ఎస్.సమ్మయ్య, ఆర్.రామారావు, ఎస్.హరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఐ.శ్రీకాంత్, ఎస్.సావిత్రి, జి.భాను, ఎస్.మోహినమ్మ పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: విశాఖపట్నంలో టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై వివరించారు. ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌తో పాటు జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ తదితరులు ఉన్నారు.

స్వామిబాబు పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : స్వతంత్ర సమర యోధుడు పొట్నూరు స్వామిబాబు జీవితం నేటితరానికి ఆదర్శమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని కళింగవైశ్య కళ్యాణ మండపంలో కళింగ కోమటి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ముద్రించిన స్వామిబాబు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రచయిత నల్లి ధర్మారావు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'



లావేరు : అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

లావేరు : లావేరుశాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో జాతీయ నాయకుల ఫొటోలతో వారి జీవిత చరిత్రను వివరించారు. గాంధీ మహాత్ముడు, నెహ్రూ, లాల్‌బహుదూర్ శాస్త్రి, చంద్రశేఖర అజాద్, మదర్ థెరిసా, అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణతో పాటు మరికొంతమంది ప్రముఖుల గురించి విద్యార్థులు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల తరగతుల పుస్తకాలికే పరిమితం కాకుండా జాతీయ నాయకులు, సమరయోధులు వారు దేశానికి చేసిన సేవలు క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. ప్రతి ఆదివారమూ చదవడం మాకిష్టం కార్యక్రమానికి విద్యార్థులు వచ్చి పూర్తిస్థాయిలో బాల సాహిత్యం, చిన్నారుల పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా వివిధ రకాల పోటీలను నిర్వహించారు. కథలు, దేశ పోరాట యోధుల జీవిత చరిత్రలు, పొడుపు కథలు, దిన పత్రికలు చదివించారు. అనంతరం తెలివితేటలు, అబద్ధం వల్ల జరిగే ప్రమాదాలు, మనం రోజు తినే ఆహారంలో విటమిన్స్ గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకుంటే అధిక దిగుబడులు

కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుంటే అధిక దిగుబడులు సాధించి నికర ఆదాయాన్ని పొందవచ్చునని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి 95వ సంస్థాపక, సాంకేతిక దినోత్సవాలను ఆదిఆవరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పొడి ఎదలో తీసుకోవాల్సిన మెలకువలను, కలుపు యాజమాన్యంపై శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి మాట్లాడుతూ సాగు ఖర్చు తగ్గించే వ్యవసాయ సాంకేతికతను రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ ఆవశ్యకతను తెలియజేశారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ చేపల పెంపకంలోని



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మెలకువలను రైతులకు వివరించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ నారు యాజమాన్యంలో విలువలను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సునీత విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి వివరించారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ వరి ఎదలో కలుపు నివారణ గురించి అవగాహన కల్పించారు. సృజనాత్మక రైతుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ బి.వి.రమణమూర్తి, ఒడిశా నుంచి సంతోష్, ప్రభు తమరి పాల్గొన్నారు.

'ఏడంతస్తుల'తో ఏడాది పొడవునా కూరగాయలు



విత్తనాలు వేస్తున్న సిబ్బంది, రైతులు

రణస్థలం: ఏడంతస్తుల నమూనా (36X36 మోడల్) వేయించడం వల్ల ఒక కుటుంబానికి ఏడాది పొడుగునా సమగ్ర పోషకాలు ఉన్న ఆహారం అందుబాటులో ఉంటుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు సూచించారు. రణస్థలంలో కేలం అప్పారావు, కరిమజ్జి జయమ్మ అనే రైతులతో ఆదివారం ఏడంతస్తుల నమూనా వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడంతస్తుల నమూనా వల్ల ఒక కుటుంబానికి ఏడాది పొడుగునా సమగ్ర పోషకాలు ఉన్న ఆహారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇందులో ఒకటో అంతస్తు దుంప జాతి, ముల్లంగి క్యారెట్, రెండో అంతస్త తీగజాతి కాకర బీర ఆనప, మూడో అంతస్తు ఆకుకూరలు తోటకూర, గోంగూర, పాలకూర, నాలుగో అంతస్తు కాయగూరలు, వంగ, టమాట, చిక్కుడు, బెండ ఐదో అంతస్తు బహువార్షికాలు, కంది, ఆముదము, ఆరో అంతస్తు చిన్న పండ్ల జాతి, బొప్పాయి, మునగ, జామ, ఏడో అంతస్తు పెద్ద పండ్ల జాతి, కొబ్బరి, మామిడి, సపోటా తదితరులు వేసుకోవాలని రైతులకు సచించారు. రెండు, మూడు సెంట్లు విస్తీర్ణంలో ఏడంతస్తుల నమూనా నాటుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కేలం అప్పారావు, గడ్డపు రమణమ్మ, ఎన్ని ధనలక్ష్మి, కేలం లక్ష్మి, స్వయం శక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చేపల వ్యర్థాలతో మీనామృతం తయారీ

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం యూనిట్ బంటుపల్లిలో చేపల వ్యర్థాలతో మీనామృతం అనే ద్రావణాన్ని ఆదివారం తయారు చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి మాట్లాడుతూ ఈ ద్రావణం తయారీకి 1:1 నిష్పత్తిలో చేపల వ్యర్థాలు, బెల్లం తీసుకొని రెండింటిని ఒక కుండలో వేసుకొని రెండు పూటలా కలుపుకోవాలన్నారు. ఈ విధంగా ద్రావణం 15 రోజులకు తయారవుతుంది. ఇలా తయారైన మిశ్రమాన్ని ఐదు లీటర్ల ఆవు మూత్రం 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటపై పిచికారీ చేయడం వల్ల పంటలు ఎదుగుదలకు, దిగుబడి పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కార్యకర్తలు సూర్యకాంతం, రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని కొత్తకుంకంలో చేపల వ్యర్థాలతో మీనామృతం అనే ద్రావణాన్ని తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిజిటల్ రాంబాబు సోమశేఖర్ మాట్లాడుతూ ఈ ద్రావణం తయారీకి 1:1 నిష్పత్తిలో చేపల వ్యర్థాలు, బెల్లం తీసుకొని రెండింటిని ఒక కుండలో వేసుకొని రెండు పూటలా కలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాంబాబు, మల్లేషు, గోపాల్, గాయత్రి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



రణస్థలం: మీనామృతం తయారు చేస్తున్న సిబ్బంది



వాణితో మాట్లాడుతున్న నాయకులు

కంకర తరలింపు ఆపాలని వినతి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

పంచాయతీ అనుమతులు లేకుండా సంతబొమ్మాళి పెద్దకొండ నుంచి తరలిపోతున్న కంకర రవాణా ఆపాలని వైసిపి నాయకులు కోరారు. ఈ మేరకు టెక్కలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణిని ఆదివారం కలిసి ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా మండలానికి చెందిన వైసిపి నాయకుడు పోర్ట్ కాంట్రాక్టు యాజమాన్యంతో కుమ్మక్కై కంకర అక్రమంగా తరలిస్తున్నారని అన్నారు. పెద్దకొండను ఆనుకొని హైస్కూల్‌తో పాటు తహశీల్దార్, ఎంపిడిఒ, ఉపాధి హామీ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ఈ కంకర తవ్వేయడం వల్ల భవనాలు దెబ్బతింటాయని వివరించారు. గతంలో మండలంలో ఈస్టుకోస్టు థర్మల్ పవర్ ప్లాంట్‌కు కంకర తరలింపు తరలించినప్పుడు గ్రామస్తులంతా ఐక్యంగా అడ్డుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కంకర తరలింపుపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని, వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని ఉందని అన్నారు. ప్రజలు ఎదురు తిరిగే ముందు కంకర రవాణా ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, ప్రతినిధి అప్పారావు, ఎంపిటిసి ప్రతినిధులు ధూబ వేణు, శిమ్మ సోమేశ్వరరావు, వాదాల దుర్గారావు, అట్టాడ సాయి పాల్గొన్నారు. వాణి స్పందిస్తూ... మంగళవారం సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

సమిష్టిగా ముందుకు పోదాం

పోలాకి : సమాజంలో ఉన్నత స్థాయికి చేరాలంటే కాపులమంతా ఐకమత్యంతో ఉండి ముందుకు సాగాలని డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని డోలలో డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్మోహనరావు ఆధ్వర్యాన కాపు సామాజిక భవన నిర్మాణానికి నియోజకవర్గస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో కాపు సామాజిక తరగతికి చెందిన భవన నిర్మాణం అవసరం ఉందని అన్నారు. అప్పట్లో మాజీ మంత్రి కీర్తిశేషులు గొర్లె శ్రీరాములు నాయుడు ఆ ప్రతిపాదన చేశారని గుర్తు చేశారు. నేటికీ అది నెరవేరలేదని అన్నారు. అందరూ కలిసి సంకల్పంతో ముందు స్థలం సమీకరించి అనంతరం నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పతివాడ గిరీష్, నరసన్నపేట వైఎస్ సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, దేవాది సర్పంచ్ మంతిని రాము, నాయకులు ఈసర్ల చిన్ని, వై.వి.రమణ, ఎల్.రవి, ఎల్.రాంబాబు, కరిమి శ్రీను, ఎన్ని రమణ, వై.హరికృష్ణ పాల్గొన్నారు.

పొలం గట్లపై కూరగాయల సాగు

ఆమదాలవలస : వరి పొలం గట్లపై కూరగాయలతో ఆదనపు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యాన నిమ్మతొర్లాడలో వంగ, టమాట, బంతి తదితర విత్తనాలను పొలం గట్లపై వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన పొలం గట్లపై పలు రకాల కూరగాయలను అంతర పంటలుగా వేసుకోవడానికి నార్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఆధ్వర్యాన గ్రామాల్లో అవసరమైన సీడ్ టూ సీడ్ కిట్స్‌లో ఉండాల్సిన కూరగాయల కోసం ఈ నారుమడులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి సేద్యంలో పంటలు పండించే రైతులకు అవసరమైన ప్రోత్సాహాన్ని క్షేత్రస్థాయిలో అందిస్తున్నామని వివరించారు.